ప్రజాశక్తి
సోమవారం 20 జనవరి 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

సూక్ష్మానికి లేని మోక్షం

◆ 9 వేలకు 777 ఎకరాలకు మాత్రమే పరికరాల అందజేత ◆ పురోగతిలేని సూక్ష్మ సాగునీటి పథకం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సూక్ష్మ సేద్యానికి ఏ ప్రభుత్వంలోనూ మోక్షం లభించడంలేదు. విధించుకున్న లక్ష్యాల్లో కనిపించిన గొప్పతనం ఆచరణలో నీరుగారుతోంది. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 9 వేల ఎకరాల్లో బిందు, తుంపర సేద్యం అమలు చేయాలని లక్ష్యం నిర్దేశించుకుని, 777 ఎకరాలకు మాత్రమే డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలను రైతులకు అందజేశారు.

జిల్లాలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మనీటి సాగు పథకం (ఏపిఎంఐపి), ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన (పిఎంకెఎస్‌వై) కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో రూ.17.95 కోట్ల వ్యయంతో 9 వేల ఎకరాల్లో సూక్ష్మ సేద్యం అమలుచేయాలని భావించారు. నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో పథకం అమలు ఆశించిన స్థాయిలో జరగడంలేదు. వాస్తవానికి 8,142 ఎకరాల్లో సూక్ష్మ సేద్యం కోసం 3,168 మంది రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. వీరిలో 3550 ఎకరాలకు సంబంధించిన 1454 మంది రైతులు దరఖాస్తులను ప్రాథమికంగా అధికారులు పరిశీలించారు. 559 మంది రైతులను అర్హులుగా గుర్తించి 1245 ఎకరాలకు పరికరాల సరఫరాకు పరిపాలనామోదం ఇచ్చారు. ఇక్కడ పరిపాలనామోదం లభించిన రైతులందరికీ సూక్ష్మ సేద్య పరికరాలు అందజేయలేదు. పరిపాలనామోదం వచ్చిన 559 మంది రైతుల్లో 351 మంది రైతులకు చెందిన 777 ఎకరాలకు మాత్రమే పరికరాలు అందజేసినట్లు ఆ శాఖల గణాంకాలు చెబుతున్నాయి.

తక్కువ నీటితో వ్యవసాయ, ఉద్యాన, ఇతర పంటలను సాగుచేయడం ద్వారా సాగు ఖర్చులు తగ్గి, నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించడానికి రైతులను ప్రోత్సహిస్తున్నట్లు చెబుతున్న ప్రభుత్వాలు సూక్ష్మ సేద్య పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు సకాలంలో పరికరాలు అందజేయకపోవడం శోచనీయం. పరికరాల అందజేతలో జరుగుతున్న మిగతా 2లో..

మహాధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

'ఉక్కు'పై సిపిఎం మహాధర్నా

ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని రద్దు చేయాలని నేతల డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని రద్దు చేయాలని, కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయిస్తూ ప్రధాని మోడీ ప్రకటన చేసేలా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఒత్తిడి చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా చేపట్టారు. దీనికి విశేష స్పందన లభించింది. కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రజానాట్య మండలి కళాకారులు స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై గీతాలను ఆలపించారు. మహాధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ కూటమి నాయకులు కేంద్ర ప్రభుత్వ ప్యాకేజీకే పరిమితం కాకుండా ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రద్దు చేయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్యాకేజీ ప్లాంటుకు తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని తెలిపారు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో అశేష త్యాగాలతో విశాఖ ఉక్కు సాధించబడిందని, అదే పోరాట స్ఫూర్తితో స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో రక్షించుకునేందుకు ఉద్యమాన్ని ఉధృతం చేయాలని మిగతా 2లో..

అమిత్‌షా గోబ్యాక్ నిరసనలు
▶ వార్త 8లో..

లంకెబిందెల పేరుతో మోసం
▶ వార్త 3లో..

మాధవ్ తప్పుడు మాటలు కట్టిపెట్టాలి
▶ వార్త 4లో..

ఆశాజనకంగా భూగర్భ నీటి వనరులు

'ప్రజాశక్తి'తో జిల్లా భూగర్భ జల వనరుల అధికారి జి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అనకాపల్లి

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది భూగర్భ నీటి వనరులు ఆశాజనకంగా ఉన్నట్టు అనకాపల్లి జిల్లా భూగర్భ జలవనరుల అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. అనకాపల్లి జిల్లాలో జల వనరుల లభ్యత, వినియోగం తదితర అంశాలను ఆయన 'ప్రజాశక్తి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

జిల్లాలో భూగర్భ జలవనరుల లభ్యత ఎలా ఉంది ?

జిల్లాలో ప్రతి మండలంలో గత ఏడాది కంటే భూగర్భ జల వనరుల శాతం పెరిగింది. జిల్లాలో సాధారణ వర్షపాతం 2023 - 24లో 17.8 మిల్లీమీటర్లు తక్కువ ఉంది. అయితే, 2024 డిసెంబర్ 26 నాటికి సాధారణ వర్షపాతం 987.38 మిల్లీమీటర్లకుగాను 1163.02 మిల్లీమీటర్లు కురిసింది.

జిల్లాలో భూగర్భ జలాలు ఏ ప్రాంతంలో అడుగంటాయి ? ఏ ప్రాంతంలో పైకి ఉన్నాయి ?

దేవరాపల్లి మండలం తామరబ్బ గ్రామంలో 21.26 మీటర్లు లోతున నీటిమట్టం ఉండగా, కశింకోట మండలం ఎఎస్.పేటలో 0.17 మీటర్లలో నీటి లభ్యత ఉంది. మూడు మీటర్ల కంటే తక్కువ నీటి లభ్యత ఎనిమిది మండలాల్లోని 41 గ్రామాల్లోనూ, మూడు నుంచి ఎనిమిది మీటర్ల నీటి లభ్యత 13 మండలాల్లోనూ, 8 నుంచి 20 మీటర్ల నీటి లభ్యత మూడు మిగతా 2లో..

సమాచార చేరవేతలో..

మీడియాది బాధ్యతాయుత పాత్ర

జ్యుడిషియల్ రీజనల్ కాన్ఫరెన్స్‌లో సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులు

కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జస్టిస్ కురియన్ జోసెఫ్, ముస్తాక్యు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కోర్టులు - మీడియా పరస్పర సహకారంతో, సమన్వయంతో పని చేయాల్సి ఉందని, జవాబుదారీతనంతో కూడిన పనితీరును ప్రదర్శిస్తూ, బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు పేర్కొన్నారు. 'జ్యుడీషియరీ అండ్ మీడియా' అనే అంశంపై జరిగిన మేధోపరమైన చర్చలో పలు అంశాలపై వారివారి ఆలోచనలను పంచుకున్నారు. ట్రయిల్ కోర్టులో, ఇతర న్యాయపరమైన అంశాల్లో మీడియా పాత్ర ఎలా ఉండాలి, దాని పరిధి, పరిమితులపై సుదీర్ఘంగా చర్చించారు. గతంలో జరిగిన సంఘటలను సోదాహరణంగా వివరించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భావితర జడ్జిలు ఎలా వ్యవహరించాలి అనే కోణంలో విశ్లేషణ చేశారు. పలు అంశాలపై సీనియర్ న్యాయమూర్తులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. విశాఖ బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ హాలులో తలపెట్టిన సౌత్ జోన్ - 2 జ్యుడిషియల్ కాన్ఫరెన్స్‌లో భాగంగా రెండో రోజైన ఆదివారం 'జ్యుడీషియరీ అండ్ మీడియా, అడ్వాన్సింగ్ జ్యుడీషియల్ గవర్నెన్స్ త్రూ ఎమెర్జింగ్ అండ్ ఫ్యూచర్ టెక్నాలజీస్' అనే అంశాలపై చర్చ నిర్వహించారు. ముందుగా సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షతన కోర్టులు - మీడియా పాత్ర అనే అంశంపై చర్చ జరిగింది. రిసోర్స్ పర్సన్లుగా కేరళ హైకోర్టు న్యాయమూర్తి దేవన్ రామచంద్రన్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మౌషిమి భట్టాచార్య వ్యవహరించారు. పీపీటీ ద్వారా పలు అంశాలపై వివరణ ఇచ్చారు. అనంతరం అడ్వాన్సింగ్ జ్యుడీషియల్ గవర్నెన్స్‌పై జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షతన మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సూక్ష్మానికి లేని మోక్షం

జాప్యంతో రైతులు ఆసక్తి చూపడంలేదు.

ఎవరు అర్హులు

ఐదెకరాల్లోపు భూమి కలిగిన రైతులకు బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్) కింద 90 శాతం రాయితీ, ఐదెకరాల నుంచి 12.5 ఎకరాల మధ్య భూమి వున్న రైతులకు 50 శాతం రాయితీపై పరికరాలను ప్రభుత్వం అందజేయనుంది. తుంపర సేద్యం (స్ప్రింక్లర్ల ఇరిగేషన్)కు ఐదెకరాల కంటే తక్కువ భూమి కలిగిన రైతులకు 55 శాతం రాయితీ, ఐదెకరాలు పైబడిన రైతుకు 45 శాతం రాయితీపై ఎపిఎంఐపి సూక్ష్మ సేద్య పరికరాలను రైతులకు అందజేయనుంది.

బిందు, తుంపర సేద్య పరికరాలకు దరఖాస్తు చేసుకొనే రైతుకు తప్పనిసరిగా బోరుగానీ, బావిగానీ వుండాలి. వాటికి విద్యుత్ సౌకర్యం వుండాలి. ఇవన్నీ వున్న రైతులు సూక్ష్మ సేద్య పరికరాల కోసం భూ హక్కు పత్రం, బ్యాంకు పాస్ బుక్, ఆధార్ కార్డు, ఎఫ్ఎంబి నకలు తీసుకొనివెళ్లి రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సివుంది. అయితే, ఇవన్నీ పట్టుకొని దరఖాస్తు చేసిన రైతులకు ఎప్పటిలోగా సూక్ష్మ సేద్య పరికరాలు అందజేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

ఆశాజనకంగా భూగర్భ నీటి వనరులు

మండలాల్లోని ఎనిమిది గ్రామాల్లోనూ, 20 మీటర్ల కంటే లోతుగా దేవరాపల్లి మండలం తామరబ్బలోనూ ఉంది.

భూగర్భ జలాలు పెంచేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎపిఐఐఎటి ప్రాజెక్టు ద్వారా చెరువుల కింద ఆయకట్టు రైతులకు క్రాప్ వాటర్ బడ్జెట్‌పై అవగాహన కల్పిస్తున్నాం. రబీ తర్వాత మిగిలిన భూగర్భ జలాలతో ఏయే పంటలు వేసుకోవచ్చో వివరిస్తున్నాం. ప్రధానంగా రైతులు వాణిజ్య పంటలైన చెరుకు, ఇతర పంటలకు బదులు తక్కువ నీటిని వినియోగించి ఎక్కువ ఆదాయం పొందే చిరుధాన్యాలు వంటి పంటలు, ఉద్యానవన పంటల వైపు వెళ్లేలా అవగాహన కల్పిస్తున్నాం. అలాగే వ్యవసాయ, పరిశ్రమలు, గృహ సంబంధ అవసరమైన సర్వేలు నిర్వహించడం, సాంకేతిక సలహాలను అందించడం చేస్తున్నాం.

సమాచార చేరవేతలో.. మీడియాది బాధ్యతాయుత పాత్ర

చర్చ జరగ్గా.. కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.ఎం.ముస్తాక్య, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఎం.సుందర్ రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. కేరళ హైకోర్టులో అనుసరిస్తున్న ఎఐ విధానాలను వివరించారు.

ప్రాంతీయ సదస్సులో భాగంగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ మాట్లాడుతూ మీడియా అందించే సమాచారం విశ్వసనీయతను కలిగి ఉండాలని అన్నారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తి దేవన్ రామచంద్రన్ ఫోర్త్ ఎస్టేట్‌గా ప్రాచుర్యం సంపాదించుకున్న మీడియాలో ఎన్నో మార్పులు సంతరించుకున్నాయని, కొన్ని సందర్భాల్లో కోర్టులను, కోర్టు పరిధిలోని అంశాలపై ప్రభావం చూపిస్తున్నాయని అన్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మౌషిమి భట్టాచార్య మాట్లాడుతూ జ్యుడీషియరీ విభాగంలో పని చేసే వారంతా మీడియాపై, అక్కడ జరిగే పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కోల్‌కతాలో జరిగిన ఆర్జీకర్ ఆసుపత్రి ఘటన, ఇతర ఘటనల్లో మీడియా వ్యవహరించిన తీరును ప్రస్తావించారు. మెయిన్ స్ట్రీమ్ మీడియా, సోషల్ మీడియాకున్న పరిమితుల గురించి ఇరు గ్రూపులూ తెలుసుకోవాల్సి ఉందని చెప్పారు. కోర్టు వ్యవహారాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) పాత్రపై మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఎం.సుందర్ విశ్లేషణ చేశారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తి ఎ.ఎం. ముస్తాక్య బ్లాక్ చైన్ టెక్నాలజీ గురించి మాట్లాడారు. కేరళ హైకోర్టులో అనుసరిస్తున్న ఎఐ టెక్నాలజీ గురించి పీపీటీ ద్వారా వివరించారు. ఈ - కోర్టు రూముల గురించి, సాంకేతిక సిబ్బంది సహకారం గురించి తెలిపారు. కేరళలో కోర్టు వ్యవహారాల నివేదికలను రూపొందించేందుకు ఎఐ, గూగుల్ నోట్ బుక్ సాయం తీసుకుంటున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ, ఇతర సీనియర్ న్యాయమూర్తులు, హైకోర్టు, జిల్లా కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంలో సోషల్ మీడియా కృషి అభినందనీయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి చైతన్యవంతంతో సహకరిస్తూ ముందడుగు వేసిన సామాజిక మాధ్యమ ప్రభావశీలులు (సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్)అందించిన సామాజిక సహకారం అభినందనీయమని, అందరికీ స్ఫూర్తిదాయకమని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన జివిఎంసి, వైజాగ్ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్, వైజాగ్ సిటీ పేజెస్ ఇన్‌స్టాకమ్యూనిటీ, మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంయుక్తంగా ఆర్కే బీచ్ సమీపంలో నిర్వహించిన ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్ కార్యక్రమానికి పుష్ప-2 చిత్రం నటి కుమారి పావని, జివిఎంసి అధికారులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులతో కలిగే నష్టాలను వివరించారు.

ర్యాలీలో పాల్గొన్న జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్

'ఉక్కు'పై సిపిఎం మహాధర్నా

(మొదటి పేజీ తరువాయి..) పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిపోయిందని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రకటిస్తున్నారుగానీ ప్రధాని మోడీ చేత ఆ ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పూర్వ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కన్నా కార్పొరేట్ల ప్రయోజనాలకే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని విమర్శించారు. కార్పొరేట్లకు తమ దోపిడీ కొనసాగడానికి ఎటువంటి ఆందోళనలూ లేని ప్రశాంత వాతావరణం కావాలని, విశాఖ ఉక్కుకు ప్యాకేజీ మాత్రమే ప్రకటించి, కార్మిక, ప్రజా పోరాటాన్ని శాంతింపజేసి, నక్కపల్లి ప్రాంతంలో మిట్టల్ ప్లాంట్ ఏర్పాటు అయ్యాక విశాఖ ఉక్కును కబలిస్తారని తెలిపారు. ఈ కుట్రల పట్ల విశాఖ ఉక్కు కార్మికులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయం ప్లాంట్ మెడ మీద కత్తిలా వేలాడుతోందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు మాట్లాడుతూ విశాఖ ఉక్కుకు పూర్వవైభవం తీసుకువస్తామని ప్రధాని, దేశంలో నెంబర్ వన్ స్థానంలోకి తీసుకువస్తామని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కూటమి నేతలు ప్రకటనలు గుప్పిస్తున్నారని, వారికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ప్లాంటులో ఉత్పత్తి కారకులైన కార్మికులకు వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులను, కార్మికులను వేలాదిగా తగ్గించేస్తూ ప్లాంట్‌లో పూర్తి ఉత్పత్తి ఎలా సాధించగలరని ప్రశ్నించారు. మెడికల్ చెకప్, టెండర్లలో 30 శాతం కార్మికుల తగ్గింపు పేరుతో వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడానికి పూనుకుంటున్నారన్నారు. విఆర్ఎస్‌ను, అక్రమ తొలగింపులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులు 8,500 మంది ఇప్పటికీ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి నేతలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి వారికి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నాలుగు సంవత్సరాల క్రితం ఉద్యమం ప్రారంభమైందని, ఇప్పటికీ ఈ డిమాండ్ నెరవేరలేదని, ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం రద్దయ్యే వరకు ఉద్యమం కొనసాగించాలని పిలుపునిచ్చారు. కూటమి నేతలు మోడీ ప్రభుత్వంతో ఉక్కు పరిరక్షణ ప్రకటన చేయించి సంబరాలు జరిపితే ప్రజలు హర్షిస్తారని హితవు పలికారు.

పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు యు.రామస్వామి, జె.అయోధ్యారాం, వైటి.దాస్, నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, సిపిఎం జిల్లా నాయకులు వి.కృష్ణారావు, ఎం.సుబ్బారావు, పి.పైడిరాజు, బొట్టా ఈశ్వరమ్మ, బి.వెంకటరావు, ఎం.రాంబాబు, కె.రమాప్రభ, డి.అప్పలరాజు, వి.నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత వేగితోట జట్టు

ప్రజాశక్తి - అల్లూరి జిల్లా : చింతూరు డివిజన్ కేంద్రంలోని సంతపాకల క్రీడామైదానంలో నిర్వహించిన జెకెసిటి వాలీబాల్ టోర్నీ విజేతగా వేగితోట జట్టు నిలిచింది. డివిజన్‌స్థాయి వాలీబాల్ టోర్నీలో 28జట్లు పాల్గొనగా, వేగితోట, చొప్పల్లి జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం హోరాహోరీగా, ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్‌లో 25-23, 30-28 పాయింట్ల తేడాతో వరుసగా రెండుసెట్లలో విజయం సాధించిన వేగితోట జట్టు విజేతగా నిలవగా, చొప్పల్లి జట్టు రన్నరప్ స్థానానికి పరిమితమైంది. విజేత వేగితోట, రన్నరప్ చొప్పల్లి జట్టు క్రీడాకారులకు టోర్నీ నిర్వాహకులు సహాయసహకారాలు అందించిన జెకెసి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జమాల్‌ఖాన్ అభినందించి, ట్రోఫీతోపాటు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జమాల్‌ఖాన్ మాట్లాడుతూ, గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సాహించడంతోపాటు యువత చెడువ్యసనాలు, పెడదోవ పట్టకుండా ఉండేందుకు ఇటువంటి క్రీడాపోటీలు ఎంతగానో దోహద పడతాయనే ఉద్దేశ్యంతో వీటి నిర్వహణకు సహాయ సహకారాలను అందించామన్నారు.

డాక్యుమెంట్ పోయినది

నా పేరు కొర్ల చంద్రశేఖరరావు S/o కె.మధుసూదన నేను కూర్మన్నపాలెం నుండి అనకాపల్లి వెళ్లుతుండగా నా యొక్క బ్యాగ్ పోయినది దానిలో నాయొక్క ఇంటి లింక్ ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబరు 4306/2004 పోయినది. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయవలయును.

కొర్ల చంద్రశేఖరరావు
S/o కె.మధుసూధన
డోర్ నెం. 31-28-20/16, రాజలక్ష్మి ప్యాలెస్ ఫ్లాట్ నెం.302, కూర్మన్నపాలెం, విశాఖపట్నం.
సెల్ : 9550842006, 8074320093

మహారాజశ్రీ అనకాపల్లి 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 75 / 2022

పిటీషన్:
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, శిరసపల్లి బ్రాంచి ...వాది
అండ్:
పాలిక సంజీవరావు వగైరాలు ...ప్రతివాదులు

దావా సమను

టు:
2వ ప్రతివాది: పాలిక భాస్కరరావు, తండ్రి లేటు అప్పలనాయుడు, హిందూ, వయస్సు 47 సం॥లు, ఫార్మసిటీ కాలనీ, తాడివలసై, పరవాడ మండలం, విశాఖపట్నం జిల్లా.

పై నెంబరు దావాలో శ్రీకోర్టు వారు పంపిన సమన్సు మీరు అందుకోనందున సదరు కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **తే:27-1-2025దీకి** వాయిదా వేసి యున్నారు. కావున ఆరోజు **ఉదయం 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేక మీ తరవున లాయరుగారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై నెంబరు తీర్మానించబడును.

సిహెచ్.ఎస్.ఎస్.రామచంద్రరావు
అడ్వకేట్, అనకాపల్లి.

IN THE HONOURABLE COURT OF THE IIIRD ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM (FAMILY COURT)
O.S. 11/2024

Between:
1. Korada Sankar Kumar and another ......Plaintiffs
And:
1.Damera Venkata Rao and another ......Defendants
To
D2. Komati Veerayya, s/o late Nandayya, Hindu, aged 49 years, residing at door No. 35-93-340/1, Indira Nagar-5. Kancharapalem, Visakhapatnam city and district.

It is to inform you that the above matter stands posted to on 21-01-2025 for your appearance.Hence you have to appear before the Honourable court on **21-01-2025 at about 10.30 AM.**as in person or through an advocate without fail,otherwise the matter will be decided in your absence.
// By order of the Honourable court//

Baratam Nageswara rao
Advocate for plaintiff
Srikakulam

మహారాజశ్రీ నర్సీపట్నం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.77/2020

వాది : ...యల్లపు సత్యనారాయణ
ప్రతివాదులు :
1. యల్లపు పరసన్న అనే తాతారావు
2. దాడి నాయుడు
3. భీశెట్టి హనుమంతు

CPC ఆర్డరు 5 రూలు 20 ప్రకారము 2వ ప్రతివాదికి దావా సమనులు ప్రకటన

2వ ప్రతివాది :
దాడి నాయుడు S/o శ్రీను బ్యాంకు ఉద్యోగి,సోమలింగపాలెంగ్రామం, యలమంచిలి మండలం

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మీకు పలు పర్యాయములు కోర్ట్ నుండి మరియు రిజిస్టరు పోస్టు ద్వారానూ దావా సమనులు పంపినప్పటికీ మీరు అందుకొని యుండలేదు. అందుపై శ్రీ కోర్టు వారు మీకు దావా సమనులు పత్రికా ప్రకటన ద్వారా పంపవలని ఉత్తరువులు జారి చేయించి యున్నారు. కాగా ఇందుమూలముగా మీకు తెలియ జేయునది ఏమనగా పై నెంబరు దావాను శ్రీ కోర్టు వారు తే.30.01.2025కు వాయిదా వేయించి ఉన్నారు. **తే.30.01.2025 దిన** మీరు స్వయంగా కాని న్యాయవాది ద్వారా గాని హాజరయి మీకు ఏమైనా ఆక్షేపణ లున్న యెడల శ్రీ కోర్టు వారికి తెలియ జేసుకొనవలెను. లేనియెడల మీకు ఎట్టి ఆక్షేపణలు లేవని ఎంచి మీ పరోక్షములో శ్రీ కోర్టువారు తమ ముందున్న దస్తావేజుల ఆధారముగా తీర్పు చెప్పుదరు.

వాయిదా తేది : తే.30.01.2025

మెట్ట ప్రభాకర్
న్యాయవాది, నర్సీపట్నం
ఫోన్ నెం.8179154586
7989015974.
నర్సీపట్నం
తే.19.01.2025

మహారాజశ్రీ నర్సీపట్నం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. 3/2020 O.S.77/2020

వాది/పిటీషనరు: యల్లపు సత్యనారాయణ
ప్రతివాదులు/ రెస్పాన్డేంట్లు :
1. యల్లపు పరసన్న అనే తాతారావు
2. దాడి నాయుడు
3. భీశెట్టి హనుమంతు

CPC ఆర్డరు 5 రూలు 20 ప్రకారము 2వ ప్రతివాది / రెస్పాన్డెంట్‌కు I.A. నోటీసుల ప్రకటన

2వ ప్రతివాది/ రెస్పాన్డేంట్:
దాడి నాయుడు S/o శ్రీను బ్యాంకు ఉద్యోగి,సోమలింగపాలెంగ్రామం,యలమంచిలి మండలం

పై నెంబరు పిటీషన్ లో 2వ ప్రతివాది/ రెస్పాన్డేంట్ అయిన మీకు పలు పర్యాయములు కోర్ట్ నుండి మరియు రిజిస్టరు పోస్టు ద్వారానూ పిటిషన్ నోటీసులు పంపినప్పటికీ మీరు అందుకొని యుండలేదు. అందుపై శ్రీ కోర్టు వారు మీకు పిటిషన్ నోటీసులు పత్రికా ప్రకటన ద్వారా పంపవలని ఉత్తరువులు జారి చేయించి యున్నారు. కాగా ఇందుమూలముగా మీకు తెలియ జేయునది ఏమనగా పై నెంబరు దావాను శ్రీ కోర్టు వారు తే.30.01.2025కు వాయిదా వేయించి ఉన్నారు. **తే.30.01.2025 దిన** మీరు స్వయంగా కాని న్యాయవాది ద్వారా గాని హాజరయి మీకు ఏమైనా ఆక్షేపణ లున్న యెడల శ్రీ కోర్టు వారికి తెలియ జేసుకోవలెను. లేనియెడల మీకు ఎట్టి ఆక్షేపణలు లేవని ఎంచి మీ పరోక్షములో శ్రీ కోర్టువారు తమ ముందున్న దస్తావేజుల ఆధారముగా తీర్పు చెప్పుదరు.

వాయిదా తేది : తే.30.01.2025

మెట్ట ప్రభాకర్
న్యాయవాది, నర్సీపట్నం
ఫోన్ నెం.8179154586
7989015974.
నర్సీపట్నం
తే.19.01.2025

మహారాజశ్రీ అనకాపల్లి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 282 / 2024

పిటీషన్:
ముత్రి సత్యనారాయణ ...వాది
అండ్:
ఒమ్మి క్రిష్ణారావు వగైరాలు ...ప్రతివాదులు

టు:
1. M/s.రామమూర్తి & సన్స్, రిప్ బై మేనేజింగ్ పార్ట్నర్ ఒమ్మి క్రిష్ణారావు, తండ్రి లేటు రామమూర్తి, హిందూ, వయస్సు 74 సం॥లు, డో.నెం.36-46-37 కంచరపాలెం, విశాఖపట్నం.
2. M/s.రామమూర్తి & సన్స్, రిప్ బై మేనేజింగ్ పార్ట్నర్ ఒమ్మి శ్రీనివాసరావు, తండ్రి లేటు రామమూర్తి, హిందూ, వయస్సు 55 సం॥లు, డో.నెం.36-46-37 కంచరపాలెం, విశాఖపట్నం.
3. ఒమ్మి సరోజ, భర్త మధుసూధనరావు, హిందూ, వయస్సు 72 సం॥లు, డో.నెం. 36-46-37, కంచరపాలెం, విశాఖపట్నం.
4. ఒమ్మి రామనారాయణ, తండ్రి లేటు మధుసూధనరావు, హిందూ, వయస్సు 56 సం॥లు, డో.నెం. 36-46-37, కంచరపాలెం, విశాఖపట్నం.
5. ఒమ్మి విష్ణు, తండ్రి లేటు మధుసూధనరావు, హిందూ, వయస్సు 53 సం॥లు, డో.నెం. 36-46-37, కంచరపాలెం, విశాఖపట్నం.

పై నెంబరు దావాలో శ్రీకోర్టు వారు మీ హాజరు నిమిత్తం **తే:13-2-2025దీకి** వాయిదా వేసి యున్నారు. కావున ఆరోజు **ఉదయం 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేక మీ తరవున లాయరుగారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై దావా తీర్మానించబడును.

ఎస్.అప్పారావు
అడ్వకేట్, అనకాపల్లి.

రైతు బజార్లు వినియోగంలోకి వచ్చేనా?

వినియోగంలోకి రాని రైతు బజారు ఇదే...

ప్రజాశక్తి -యంత్రాంగం

తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధిలో రూ.78 లక్షలతో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యాన నిర్మించిన రైతు బజారును 2024 ఫిబ్రవరి 15న అప్పటి వైసిపి ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న ముత్తం శెట్టి శ్రీనివాసరావు ఆదరా బాదరాగా ప్రారంభించారు. ప్రారంభించి సుమారు ఏడాది కావస్తున్నా ఇంకా వినియోగంలోకి రాని పరిస్థితి ఉంది. ఈ రైతు బజారు నిర్మాణ పనులు ఆరంభం నుంచీ జాప్యం నెలకొంది. నిర్మాణ సమయంలోనే మౌలిక సదుపాయాలు కల్పించి ఉంటే బాగుండేది. ఇందుకు నిధుల లేమి కూడా ఓ కారణం కావచ్చు. కనీస సదుపాయాలు కల్పించకుండానే మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు అప్పటి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. మౌలిక సదుపాయాలు కల్పించకుండానే రైతు బజారును ప్రారంభించారని అప్పట్లో పలు విమర్శలు రానే వచ్చాయి.

ఫ్లోరింగ్ పనులు చక చకా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రైతు బజారు నిర్మాణంపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే అపరిష్కృతంగా ఉన్న ఫ్లోరింగ్ విద్యుత్ సరఫరా, తాగు నీటి సదుపాయం లాంటి కనీస వసతులు కల్పించే ఉద్దేశంతో ప్రస్తుతం వారం రోజులుగా పనులు చక చకా జరుగుతున్నాయి. వీలైనంత త్వరగా రైతు బజారును వినియోగంలోకి తీసుకురావాలని నియోజకవర్గ రైతులు కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

32 దుకాణాలతో...

కూరగాయల వ్యాపారులకు 32 దుకాణాలతో రైతు బజారు ఏర్పాటు కానుంది. 1837.82 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మితమై ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం డ్రా పద్ధతిలో దుకాణాల కేటాయింపు ఉంటుంది.

ఇప్పటికే రైతు బజారు నిర్మాణంలో ఎడతెగని జాప్యం నెలకొంది. స్థల సేకరణ, ఎంపిక మొదలు రైతు బజారు మంజూరు, నిధులు కేటాయింపు ఇలా చెప్పుకుంటూ పోతే రైతు బజారు ఏర్పాటుకు ఏళ్ల గడిచాయి. రైతు బజారును వీలైనంత త్వరగా వినియోగంలోకి తేవాలని ఈ ప్రాంత కూరగాయల రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

గాజువాక : జివిఎంసి 72వ వార్డు పరిధి శ్రీనగర్‌లో పదేళ్ల క్రితం రూ.20 లక్షలతో రైతు బజార్‌ను నిర్మించారు. పది షెడ్లు వేశారు. 14 గ్రామాలు ప్రజలకు అందుబాటులో ఉంటుందని భావించారు. సాంకేతిక కారణాలు రీత్యా దాన్ని వినియోగంలోకి తేలేదు. సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు శ్రద్ధ చూపకపోవడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంటోంది. ఇనుప రేకులు చోరీకి గురవుతున్నాయి. ఈ రైతుబజార్‌ను స్థానికులు రకరకాలుగా ఉపయోగిస్తున్నారు. రాత్రి సమయంలో మందుబాబులు తాగడానికి రైతుబజార్‌ను వినియోగిస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రైతు బజార్ వినియోగంలోకి రాకపోవడం వల్ల 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న గాజువాక వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుబజార్‌ను వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

గాజువాక శ్రీనగర్‌లో రైతు బజార్ కోసం నిర్మించిన షెడ్లు

నేరాలు ఘోరాలు

లంకెబిందెల పేరుతో మోసం

- పట్టుబడ్డ మోసగాళ్లు

ప్రజాశక్తి -ఆనందపురం : లంకెబిందెల పేరుతో మోసానికి పాల్పడి రూ.లక్షల్లో వసూలు చేసిన ఘరానా మోసగాళ్లు పట్టుబడ్డారు. ఆనందపురం మండలంలో లంకె బిందెలతో కోటీశ్వర్లు అయిపోతారంటూ నలుగురిని నమ్మించి వారి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు తెలుస్తోంది. మంత్రించిన లంకె బిందెలను అందజేస్తామని కేటుగాళ్లు నమ్మించి బురిడీ కొట్టించే ప్రయత్నం చేశారు.

మండలంలోని వేమగొట్టిపాలెం గ్రామానికి చెందిన కొండ్రోతూ అప్పలరాజు (26), మల్కాపురం ప్రాంతానికి చెందిన పైడిపాటి వెంకట భార్గవరావు అలియాస్ మునిస్వామి (35), గాజువాకకు చెందిన డేరింగ్ కృష్ణకుమార్ కలిసి మునిస్వామి వద్ద లంకె బిందెలున్నాయని నమ్మించారు. దీంతో ఆనందపురం మండలం బిపి కల్లాలకు చెందిన పలువురు రూ.లక్షల్లో ముట్టజెప్పారు. పూజలు చేసి లంకె బిందెలు ఇస్తామని చెప్పినా ఇంతవరకు ఇవ్వకపోవడంతో బాధితులకు అనుమానం వచ్చింది. మునిస్వామికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆనందపురం -బోని రోడ్డులో నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి పాత రాగి సామాన్లు, కారు, 1.70 లక్షలు రికవరీ చేసినట్లు సమాచారం.

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: కారులో వెళుతున్న యువకులకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే... లంబసింగి పర్యాటక ప్రాంతం నుండి ఎస్.కోటకు చెందిన నలుగురు యువకులు కారులో ప్రయాణిస్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ను తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికి ఏమి కాక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ కోటకు చెందిన నలుగురు యువకులు ఆదివారం కారులో లంబసింగి వెళ్లి తిరిగి వస్తుండగా మున్సిపాల్టి నెల్లిమెట్ట సమీపంలో ఈ ప్రమాదం జరిగినట్లు టౌన్ పోలీసులు పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేశామని టౌన్ పోలీసులు తెలియజేశారు.

బోల్తాపడ్డ మినీ వ్యాన్

అదుపు తప్పి వ్యాన్ బోల్తా

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై ఆదివారం మినీ వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అడ్డురోడ్ నుంచి తుని వెళుతున్న మినీ వ్యాన్ నక్కపల్లి ఇసుక ర్యాంపు ప్రాంతంలో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సిఐ కుమారస్వామి, ఎస్సై సన్నిబాబుల ఆధ్వర్యంలో బోల్తా పడిన వాహనాన్ని తీయించి, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

కోడిపందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని లాలం కొత్తూరు గ్రామ శివారులో కోడిపందేలు ఆడుతున్న ఇద్దరినీ అరెస్టు చేశామని సిఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు. ఆదివారం విశ్వసనీయ సమాచారం మేరకు తమ సిబ్బందికి కోడిపందేల స్థావరంపై దాడి చేశారు. రెండు కోడిపుంజులు, రూ.1150 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దాడుల్లో ఎస్ఐ మనోజ్‌కుమార్, సూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

దగ్ధమైన పూరిల్లు

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల గ్రామంలో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పూరిల్లు దగ్ధమయింది. గ్రామానికి చెందిన కొండ్ర సత్యవతి పూరింటిలో ఆదివారం వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెల రేగడంతో ఇంట్లో ఉన్న సామాగ్రితో పాటు పూరిల్లు కాలిపోయింది. సామాగ్రి తో పాటు ఇల్లు అగ్నికి ఆహుతి అవడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వెలిబుచ్చారు.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

తగరపువలసలో సిపిఎం రాస్తారోకో

ప్రజాశక్తి -తగరపువలస : విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన ఆదివారం స్థానిక వై.జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనం మాత్రమే అన్నారు. స్టీల్ ప్లాంట్‌లో విఆర్ఎస్‌ను రద్దు చేయాలని, ఐదు వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ డివిజన్ కమిటీ నాయకులు రవ్వ నరసింగరావు మాట్లాడుతూ, పార్లమెంట్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమాన పరిచేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ను మంత్రి పదవి నుంచి తొలగించాలని కోరారు. వ్యవసాయంపై ఆధారపడిన దేశంలో రైతులు 56 రోజుల నుంచి ఉద్యమం చేస్తున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.అప్పలనాయుడు, భాగం లక్ష్మి, సిఐటియు నాయకులు నీలాతి రాము, జోగ ఆనంద్, జీరు సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

తగరపువలసలో రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు

గుండాట ఆడుతున్న ఇద్దరిపై కేసు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తీడ గ్రామ శివారులో గుండాట ఆడిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సిఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు. పక్కా సమాచారం మేరకు తమ సిబ్బంది గుండాట ఆడుతున్న వారిపై దాడులు చేశారని, ఆరు గుళ్ళు, ఒక నెంబరు పట్టాతోపాటు రూ.3210 నగదు స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఉన్న గుండాట నిందితులు

ప్రతి అక్షరం-ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక

అనుభవం కలిగిన
సబ్ ఎడిటర్
కావలెను

ప్రజాశక్తి కార్యాలయం
ప్లాట్ నెం.3, జి.బ్లాక్, ఆటోనగర్, ఇండస్ట్రియల్ పార్క్, వడ్లపూడి, ఎం.వి.వి.అపార్ట్‌మెంట్ ప్రక్కన
విశాఖపట్నం-530046
ఫోన్ : 9491570765

గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

నరవలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి-పెందుర్తి : ప్రభుత్వ సెలవు దినాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడంతో మండలంలో చాలా చోట్ల ఈ దందా సాగుతోంది. నరవ సర్వే నెంబర్ 29లో గ్రావెల్ అక్రమ తవ్వకాలను యథేచ్ఛగా చేస్తున్నారు. ఈ సర్వేనెంబర్ చుట్టుపక్కల గతంలో అక్రమ తవ్వకాలతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీనిలో చేరిన నీటిలో పడి సమీపంలో ఉన్న కళాశాల విద్యార్థులు మృతిచెందిన ఘటనలు ఉన్నాయి. అప్పట్లో అధికారులు, స్థానిక జనసేన నాయకులు హడావిడి చేశారు. మళ్లీ ఇటువైపు కన్నెత్తి చూడలేదు విచ్చలవిడిగా గ్రావెల్ త్రవ్వకాలు జరుగుతున్నా అదే గ్రామానికి చెందిన విఆర్ఓ కన్నెత్తి కూడా చూడలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు కల్పించుకొని అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

జాతీయ పోటీల టెక్నికల్ ఆఫీసర్‌గా డివిఎస్‌వై.శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : సూరత్‌లో జనవరి 19 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న సీనియర్ నేషనల్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు టెక్నికల్ ఆఫీసర్‌గా ఎల్ఐసి స్పోర్ట్స్ ప్రమోషనల్ బోర్డు మెంబర్‌గా పనిచేస్తున్న డివిఎస్‌వై.శర్మ ఎంపికయ్యారు. ఈయన ఇప్పటికే విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదా ప్రసాద్ దాస్, ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ జి.వరప్రసాద్, ప్రెసిడెంట్ ఎం.కామేశ్వరి, సహోద్యోగులతో పాటు విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జెకె.నాయక్, అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

వివేకానంద అడుగుజాడల్లో నడవాలి

ప్రజాశక్తి -పద్మనాభం : వివేకానంద అడుగుజాడల్లో విద్యార్థులు నడవాలని సిఐ సిహెచ్.శ్రీధర్ కోరారు. నెహ్రూ యువ కేంద్ర, గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ సంయుక్తంగా పద్మనాభంలోని గోస్తనీ విద్యాపీఠ్‌లో నిర్వహించిన వివేకానంద యువజనోత్సవాలు ఆదివారం ముగిశాయి. వివేకానంద చిత్రపటానికి సిఐ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, వివేకానంద ఆశయాలకు అనుగుణంగా ప్రవర్తన ఉండాలన్నారు. యువత దేశ సంపద అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు, గాలిపటాలు ఎగరవేసే పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, తమటపు నాగమణి, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, పాలూరు కృష్ణారావు, మచ్చ సోమేష్, సిరిపురపు వెంకటరావు, కె.ఈశ్వరరావు, గౌరీరెడ్డి, చొప్ప కృష్ణ, కరస్పాండెంట్ సూరిబాబు పాల్గొన్నారు.

కూలిరేట్లు, జీతాలు పెంచాలి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది, బోని, వికె.పాలెం గ్రామాల్లో పనిచేస్తున్న ఇటుక కార్మికులకు కూలి రేట్లు పెంచాలని, వాహనాల డ్రైవర్లకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ యజమానులకు ఆదివారం డిమాండ్ నోటీసులను ఇటుక వర్కర్ల యూనియన్ అధ్యక్షులు ఆర్.సురేష్, కార్యదర్శి బి.నాగరాజు అందజేశారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకనుగుణంగా కూలి రేట్లు, వేతనాలు పెంచాలని డిమాండ్‌చేశారు. డ్రైవర్లకు నెల జీతం రూ.11500 ఇస్తున్నారని, దాన్ని రూ.15 వేలకు పెంచాలని, బేటా రూ.200 నుంచి రూ.400కు పెంచాలని, నెలకు నాలుగు సెలవులు ఇవ్వాలని, వాహనాలపై లోడు తీసుకెళ్లినప్పుడు సమయం దాటితే మధ్యాహ్న భోజనం ఇవ్వాలని, ఆప్టింగ్ డ్రైవర్లకు రోజుకు రూ.1000 ఇవ్వాలని డిమాండ్ నోటీసులలో పేర్కొన్నారు.

అప్పారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి -తగరపువలస : సిపిఐ భీమిలి ఏరియా సమితి సభ్యులు చెల్లూరి అప్పారావు మృతి పార్టీకి తీరని లోటని పలువురు పార్టీ నాయకులు పేర్కొన్నారు. కొత్తపేటలో అప్పారావు సంస్మరణ సభ శనివారం నిర్వహించారు. తుదిశ్వాస వరకు పార్టీ జెండాను భుజాన మోసి, ప్రజాసమస్యలపై జరిగే అనేక ఆందోళనలు, పోరాటాల్లో అప్పారావు చురుగ్గా పాల్గొనే వారని పార్టీ నాయకులు కానూరి రాంబాబు, అల్లు బాబూరావు, ఎం.అప్పలరాజు, ఎం.వీర్రాజు తదితరులు గుర్తు చేసుకున్నారు.

కార్మిక సంఘాలపై..

మాధవ్ తప్పుడు మాటలు కట్టిపెట్టాలి

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ చేయవద్దంటూ త్రికరణ శుద్ధితో కార్మిక సంఘాలు పోరాటం చేస్తుండగా, బిజెపి మాజీ ఎమ్మెల్సీ మాధవ్ కార్మిక సంఘాలపై బాధ్యతారాహిత్యంగా ప్రకటనలు చేయడం సరికాదని, ఆ ప్రకటనను ఆయన వెనక్కి తీసుకోవాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. మాధవ్ చేసిన ప్రకటన కుహనా రాజకీయ నాయకులు చేసే ప్రకటన వంటిదని ఎద్దేవా చేశారు. 1400 రోజులుగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయరాదని కార్మిక సంఘాలు పోరాటం చేస్తున్నాయని, ఒక్క రోజైనా కార్మికులు నిర్వహిస్తున్న శిబిరానికి వచ్చి మాధవ్ మద్దతు తెలిపారా అని ప్రశ్నించారు. ఆయన బాధ్యతారాహిత్యానికి ఇది ఉదాహరణ అని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం నిర్వహిస్తున్న పోరాటం సాగుతున్న 1400 రోజుల కాలంలో, ప్రధాని మోడీ రెండు పర్యాయాలు విశాఖ నగరానికి వచ్చారని, అప్పుడు విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తామని ఆయన ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రధాని మోడీ వెళ్లి సింగరేణిని ప్రయివేటీకరణ చేయబోమని స్పష్టంగా ప్రకటించారని, అటువంటి ప్రకటన విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం అంటే పెట్టుబడిదారుల లాభం కోసం మాత్రమే అని పేర్కొన్నారు. మాధవ్‌కు చిత్తశుద్ధి ఉంటే స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తామని, ప్రయివేటీకరణ చేసేది లేదని మోడీతో ప్రకటన చేయించాలని కోరారు. త్యాగాలతో ఏర్పాటైన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకోవడం కోసం కార్మిక సంఘాలు నిజాయతీగా పోరాటం చేస్తున్నాయని, మాధవ్ వలె కుహనా రాజకీయాలు చేయడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా మాధవ్ తెలిసీతెలియని విధంగా మాట్లాడటం మానుకొని, నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

విశాఖ ఉక్కును కాపాడుకుందాం

ప్రజాశక్తి-సీతమ్మధార : దేశ సంపద అయిన విశాఖ ఉక్కును ప్రాణాలొడ్డి అయినా కాపాడుకుందామని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ పిలుపు నిచ్చింది. తెలుగు ప్రజలను వంచన చేస్తూ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణ చేసే కుట్రలో భాగంగా ఉక్కు పరిరక్షణ ప్యాకేజీ ప్రకటించారంటూ ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ ఆదివారం పౌరగ్రంథాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ, ప్యాకేజీ ఇచ్చిన వారు దాన్ని ప్లాంట్ అభివృద్ధికి వినియోగించ నీయకుండా పలు షరతులు పెట్టడం పూర్తిగా అన్యాయమన్నారు. కేవలం 0.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం గల కర్ణాటక లోని విశ్వేశ్వరయ్య స్టీల్ ప్లాంట్‌కు భేషరతుగా రూ.15000 కోట్ల ప్యాకేజీ ప్రకటించిన కేంద్రం, 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం గల విశాఖ స్టీల్ ప్లాంటుకు ఎరవేసినట్లు విదల్చడం తగదన్నారు. ఇంత అన్యాయం జరుగుతున్నా ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు కేంద్ర నిర్ణయాలకు వత్తాసు పలకడం క్షమార్హం కాదన్నారు. సుమారు రెండున్నర లక్షల కోట్ల రూపాయల పైబడి విలువ చేసే స్టీల్ ప్లాంట్‌ను కేవలం రూ.7,686 కోట్ల విలువ కట్టి ప్రయివేటుకు తెగనమ్మాలని చూడటం కేంద్రానికి తగదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఉత్తరాంధ్రలోని ప్రతి ఇంటి నుంచి ఒకరు ఒక సైనికునిలా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శరత్, ఉక్కు పోరాట కమిటీ సభ్యుడు కనకరెడ్డి, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మురికివాడల నివాసితుల సంక్షేమ సంఘం నాయకుడు రవి, భీమ్‌సేన వెల్ఫేర్ నాయకుడు కె.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

దేవన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాగేంద్ర

తిప్పల దేవన్‌రెడ్డికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి -గాజువాక : వైసిపి గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన తిప్పల దేవన్‌రెడ్డిని ఆదివారం పలువురు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వైసిపి నాయకులతో పాటు, పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీలకర్ర నాగేంద్ర కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి -సీతమ్మధార : యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని క్రైమ్ ఎసిపి వెంకట్రావు సూచించారు. పౌర గ్రంథాలయంలో క్రైమ్‌పై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతీ యువకులు మద్యానికి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సీసీ కెమెరాలను అందరూ పెట్టుకోవడం వల్ల దొంగతనాలను నివారించవచ్చని పేర్కొన్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. క్రైమ్ సిఐ చక్రధరరావు, ద్వారక ఎస్ఐ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ప్రజారోగ్యం : పివి.సురేష్

ప్రజాశక్తి- ములగాడ : పరిసరాల శుభ్రతతోనే ప్రజారోగ్యం సాధ్యమని జివిఎంసి 60వ వార్డు కార్పొరేటర్ పివి.సురేష్ అన్నారు. 60వ వార్డులో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ పివి సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలచే స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పివి.సురేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ విభాగాలు చేపట్టే ప్రతీ కార్యక్రమంలోనూ ప్రజల భాగస్వామ్యం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పారిశుధ్య నిర్వహణలో ప్రజలు తమవంతు బాధ్యతతో ఎవరికి వారు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అనంతరం స్థానిక ఎంఐజి కాలనీలోని పార్కుల్లో పేరుకున్న చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అనిల్, పూండి మల్లేశ్వరరావు, సత్యారావు, శ్రీను, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్, పార్కు మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న కార్పొరేటర్ పివి.సురేష్

ఆయుష్మాన్ భారత్ ద్వారా ఇంటింటికీ వైద్య సేవలు

మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి -ఆనందపురం : గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ ద్వారా ఇంటింటికీ వైద్య సేవలు అందించడానికి చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. గుడిలోవ విజ్ఞాన విహార్‌లో హెడ్డేవార్ నూతన ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాలను యూనిట్లుగా తీసుకొని, రాబోయే 6 నెలల్లో ఇంటింటికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందిస్తామన్నారు. స్త్రీలలో వచ్చే వివిధ రకాల కేన్సర్లకు స్క్రీనింగ్ వైద్యం ఆయుష్మాన్ భారత్ ద్వారా అందుతోందని, దీనిని అందరూ వినియోగించుకోవాలని కోరారు. ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ సి.వి.రావు మాట్లాడుతూ, జీవనశైలిలో వచ్చిన మార్పులతో అధిక రక్తపోటు, మధుమేహం వంటివి చిన్న వయసులోనే వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగయ్య, జి.సుబ్రహ్మణ్యం, జి.వెంకటప్పుడు, పివి.నారాయణయ రావు, దూసి రామకృష్ణారావు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై మంత్రికి వినతులు

గ్రామీణ వైద్యుల సమస్యలపై మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం, ఆర్ఎంపి వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి ఆర్ఎంపీల సమస్యలను వివరించారు. 2008లో నాటి ప్రభుత్వం జిఒ 429 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రిలో సుమారు నాలుగు సంవత్సరాలు శిక్షణ ఇచ్చిందని, 2012 నుంచి ఆ శిక్షణను నిలిపివేశారని, పున:ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు రవీంద్రరెడ్డి, ఆర్ఎంపి జోనల్ కోఆర్డినేటర్ పచ్చిపులుసు కనకారావు, మండల అధ్యక్షులు పోతిరెడ్డి సుధాకర్ రెడ్డి, సహాయ కార్యదర్శి లోగీసా గణేష్, సభ్యులు కేశవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని...

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంత్రి సత్య కుమార్‌యాదవ్‌ను నేషనల్ హెల్త్ మిషన్ వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. 2002లో డీఎస్సీ ద్వారా ఎంపికైనా రెగ్యులరైజేషన్ చేయలేదని వివరించారు. ఏటా ఇచ్చే ఐదు శాతం డిఎను పెంచాలని, టిఎ, డిఎ అందించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నేషనల్ హెల్త్ మిషన్ విశాఖ జిల్లా సెక్రెటరీ వీరబ్రహ్మం, ట్రెజరర్, జిల్లా టీబీ కంట్రోల్ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ ఎంవివి గోపీనాథ్, జాయింట్ సెక్రెటరీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌కు సమస్యలు వివరిస్తున్న ఎన్‌హెచ్‌ఎం

కొనసాగిన 'మారిటైం' నిర్వాసితుల దీక్షలు

వంగలి రైతులకు పలువురి సంఘీభావం

మారిటైం నిర్వాసితులకు సంఘీభావంగా కూటమి నేతలు

ప్రజాశక్తి -సబ్బవరం : మండలంలోని వంగలి గ్రామంలో మారిటైమ్ యూనివర్సిటీకి భూములిచ్చిన నిర్వాసిత దీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. తమకు ఉపాధి కల్పించాలని, గ్రామ అభివృద్ధి పనులు చేపట్టాలని శనివారం నుంచి నిర్వాసిత రైతులు నిరవధిక దీక్షలు చేపట్టారు. రెండో రోజు ఆదివారం రైతుల దీక్షలకు కూటమి నేతలు సంఘీభావం తెలిపారు. మారిటైమ్ యూనివర్సిటీ యాజమాన్యం, స్థానిక ఎమ్మెల్యేతో చర్చలు జరిపి రైతులకు న్యాయం చేస్తామని కూటమి నేతలు భరోసానిచ్చారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అపాయింట్మెంట్ కోసం ప్రయత్నించగా, ఎమ్మెల్యే పంచకర్ల సోమవారం చర్చలకు అపాయింట్మెంట్ ఇచ్చినట్టుగా యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి. రైతులు రెండో రోజు కూడా యూనివర్సిటీ ఎదుట వంటావార్పు చేపట్టారు. దీక్షలకు సంఘీభావం తెలిపిన వారిలోఉమ్మడి విశాఖ జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి ఇందల వెంకటరమణ మండల టిడిపి అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, జనసేన మండల అధ్యక్షుడు కర్రి కనకరాజు,కూటమి నేతలు దొడ్డి సూర్య ప్రకాష్ రావు,బొడ్డపల్లి సూరిదేముడు, కల్లేపల్లి ఎర్నిబాబు తదితరులు ఉన్నారు. దీక్షల్లో సర్పంచ్ ఆకుల శ్రీ హేమ గణేష్, జెట్టి ప్రసాదు, జెట్టి హేమంత్, జెట్టి పెంటారావు,జెట్టి ముత్యాల నాయుడు ఉప సర్పంచ్ గొర్లి అప్పలనాయుడు, గొర్లి కోటేశ్వరరావు, ముమ్మన అప్పలరాజు, కందా కనకరాజు, కందా రాము, జెట్టి శ్రీను, జెట్టి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పలుచోట్ల కంటి వైద్యశిబిరాలు

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి- కె.కోటపాడు: మండలంలోని చౌడువాడ శతకంపట్టు ఆవరణలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 65 మంది కంటి రోగులను పరీక్షలు చేయగా 30 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. శిబిరంలో కంటి నరాలు చికిత్సకు, చిన్నపిల్లల కంటి చికిత్సకు ఒక్కొక్కరిని, కంటి పైపొర చికిత్సకు ముగ్గురిని, కంటి నీటి కాసులు, కంటిరెప్పల చికిత్సకు చెరో ఇద్దరిని ఎంపిక చేశారు. సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ అధికారి దివ్య, క్యాంపు కో ఆర్డినేటర్ సిహెచ్ అశ్వనికుమార్ నర్సింగ్ స్టాఫ్ లావణ్య పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని కాజీపాలెం గ్రామంలో ఆదివారము భువనేశ్వరి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని టిడిపి జిల్లా కార్యదర్శి పీలా తులసి రాము ప్రారంభించారు. కార్యక్రమంలో పీలా నాగ శ్రీను, కోటి, సాయి రమేష్, వరదరాజు, రాము, వంశీ, వైద్యులు పాల్గొన్నారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు.

ఎల్ఐసిని బలోపేతం చేద్దాం

ప్రజాశక్తి-అనకాపల్లి :'ఎల్ఐసిని బలోపేతం చేద్దాం, దేశానికి సేవలు అందిద్దాం' అనే నినాదంతో ఎల్ఐసి జాతీయకరణ దినాన్ని పురస్కరించుకొని ఎల్ఐసి సంస్థ కార్యక్రమాలను రూపొందించినట్టు ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐఐఇయు) అనకాపల్లి బేస్ యూనిట్ కార్యదర్శి ఎంకె.శాస్త్రి తెలిపారు. అనేక ప్రైవేటు కంపెనీల దుశ్చర్యలకు చెక్ పెడుతూ, ఏడు దశాబ్దాల కిందట ఎల్ఐసి ని జాతీయాకరణ చేశారన్నారు. ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వం ఎల్ఐసిని ప్రైవేటీకరణ చేసేందుకు చేస్తున్న విస్తృత ప్రయత్నాల్లో భాగంగా ఎఫ్‌డిఐ 100శాతం పెంపు, ఐపిఒ శాతం పెంపు వంటి చర్యల ద్వారా ఎల్ఐసిని బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఈ పరిస్థితుల్లో దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ఎల్ఐసిని మరింత బలోపేతం చేసేందుకు ఏజెంట్లు, డెవలప్మెంట్ అధికారులు, సంస్థ ఉద్యోగులు ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్ఐసి జాతీయాకరణ దినం సందర్భంగా ఉద్యోగులు బ్యాడ్జీలు ధరించడం, నూతన వ్యాపారం కోసం పాటు పడడం, ఏజెంట్లను ఉత్తేజ పరచి నూతన వ్యాపారం అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలను రూపొందించామన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఏజెంట్లు, డెవలప్మెంట్ అధికారులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రీసర్వేపై అవగాహన అవసరం

ర్యాలీ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి- దేవరాపల్లి : భూ రీసర్వేపై రైతులందరూ అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ పి.లక్ష్మీదేవి అన్నారు. మండలంలోని ఎంపిక చేసిన గ్రామాలలో రీసర్వే ప్రారంభానికి ముందు గ్రామ సభ నిర్వహించి, అవగాహన ర్యాలీ చేపట్టి ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ముందుగా గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములను గుర్తించి, తరువాత ప్రైవేట్, వ్యవసాయ భూములను కొలతల ద్వారా భూమిని సర్వే నిర్వహిస్తామన్నారు. తెనుగుపూడి గ్రామంలో రీ సర్వే ప్రారంభించినట్టు తెలిపారు.కార్యక్రమంలో మండల సర్వేయర్ జి.గోవిందరాజులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో కార్మికులకు వేతనాలు

- గోవాడ సుగర్స్‌కు పూర్వవైభవం తెస్తాం
- ఎమ్మెల్యేలు కెఎస్ఎంఎస్.రాజు, బండారు

కార్మిక యూనియన్లతో సమావేశంలో ఎమ్మెల్యేలు రాజు, బండారు

ప్రజాశక్తి -చోడవరం :గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి పూర్వవైభవం తీసుకొస్తామని చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు కెఎస్ఎంఎస్ రాజు, బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. కార్మికుల వేతన బకాయిలను వారం రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఆదివారం సుగర్ ఫ్యాక్టరీ గెస్ట్ హౌస్‌లో కార్మికులతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, రెండు రోజుల్లో తామిద్దరం అమరావతి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థిక మంత్రిలను కలిసి ఫ్యాక్టరీ స్థితిగతులను వివరించి, నిధులను తీసుకురావడానికి ప్రయత్నిస్తామన్నారు. ఎంపీ సీఎం రమేష్‌తో కలిసి రైతులకు మద్దతు ధర దక్కేలా ఫ్యాక్టరీకి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటుకు కేంద్ర దృష్టికి తీసుకెళ్తామన్నారు. సహకార రంగంలో నడిచే గోవాడ సుగర్స్‌ను గాడిలో పెడతామని స్పష్టం చేశారు.

21 నుంచి చెరకు రెగ్యులర్ క్రషింగ్

గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో రెగ్యులర్ చెరకు క్రషింగ్ ఈనెల 21 నుంచి చేపట్టనున్నట్లు ఫ్యాక్టరీ ఎండి వి.సన్యాసినాయుడు తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల క్రషింగ్ ఆలస్యమైందన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు కె.భాస్కరరావు, ఎస్ రామనాయుడు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా సుందరపు

విజయ్‌కుమార్‌ను అభినందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - యలమంచిలి : హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విశాఖ మధుర ఎన్ హోటల్‌లో నిర్వహించిన అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశంలో కమిటీ అధ్యక్షునిగా తనను 13 ఉమ్మడి జిల్లా క్రీడా అసోసియేషన్లు ఎన్నుకోవడంపై ఆనందం వ్యక్తం చేసిన సుందరపు, వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఒలింపిక్ అసోసియేషన్ విశాఖ సభ్యులు ఎమ్మెల్యే గణబాబు, ప్రెసిడెంట్ ప్రసన్నకుమార్, ప్రధాన కార్యదర్శి కంచరణ సూర్యనారాయణ, కోశాధికారి మోహన్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గోపి ప్రతినిధులు తదితరులు విజయకుమార్‌ను అభినందించారు. పరిశీలకులుగా విష్ణు (ఫెడరేషన్), జాన్ గాలియత్ (శాప్), మోహనవెంకటరావు, (ఏపి ఒలింపిక్ అసోసియేషన్) పాల్గొనగా, ఎన్నికల అధికారిగా అడ్వకేట్ రవి వ్యవహరించారు.

విజయ్ కుమార్‌కు అభినందన

అచ్యుతాపురం : రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌ను అచ్యుతాపురం మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసిలు, బిజెపి టిడిపి జనసేన పార్టీల నేతలు, కార్యకర్తలు, క్రీడాకారులు అభినందించి, హర్షం తెలిపారు.

ప్రత్యేక ప్యాకేజీపై హర్షం

ప్రజాశక్తి- అనకాపల్లి : విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటనపై కూటమినేతలు హర్షం వ్యక్తం చేశారు. చేస్తూ ఆదివారం జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, డాక్టర్ నారాయణరావు , జనసేన, తెలుగుదేశం, బిజెపి, పార్టీల సమన్వయకర్తలు, పలుదేవస్థానం చైర్మన్లు, సర్పంచులు, మూడు పార్టీల మండల అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్ ఇన్చార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం కూటమి నాయకులు స్వీట్లు పంచుకొని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

వాసవి క్లబ్ కార్యవర్గ ప్రమాణస్వీకారం

వాసవీక్లబ్ జిల్లా సభకు హాజరైన ఆర్యవైశ్య నాయకులు

ప్రజాశక్తి -చోడవరం : వాసవి క్లబ్ జిల్లా మహాసభ ఆదివారం చోడవరంలో నిర్వహించారు ఈ సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు రామ సత్యనారాయణ, అంబిక గ్రూప్ అధినేత అంబికా కృష్ణ, సోమిశెట్టి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు గౌరవ అధ్యక్షులుగా సిఎస్ కుమార్, నర్సీపట్నం అధ్యక్షులుగా శ్రీనాథ్ వెంకట మాధవ గౌరవాధ్యక్షులుగా కాలాగర్ల శేషగిరిరావు, ఆర్యవైశ్య మహాసభ సెక్రటరీగా ఎస్ షణ్ముఖరావు, సుదురుమాటి శ్రీనివాసరావు, టిఎస్ గుప్తా, శ్రీనాథ్ శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్‌గా మాడుగుల, గోపిశెట్టి నాగేశ్వరరావు స్టేట్ సెక్రటరీగా బి రాజేష్, జాయింట్ సెక్రటరీగా బిఎస్‌వి రవికుమార్, సత్య, బి సతీష్, బి మురళీకృష్ణలను ఎన్నుకోగా, వారితో అతిథులు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో చోడవరం, మాడుగుల, అనకాపల్లి, పాడేరు వాసవి క్లబ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

చిత్రకారుడు బొడ్డేటికి ఘన సత్కారం

బొడ్డేటి సూర్యనారాయణను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి- చోడవరం : చిత్రకళా రంగానికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా సీనియర్ చిత్రకారులు, చోడవరం చిత్రకళా పరిషత్ వ్యవస్థాపకులు బొడ్డేటి సూర్యనారాయణను కోనసీమ చిత్రకళా పరిషత్ ఘనంగా సత్కరించింది. ఆదివారం అమలాపురంలోని సత్యసాయి కళ్యాణమండపంలో చిత్రకళా బ్రహ్మోత్సవం పేరిట నిర్వహించిన 35వ అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శన, బహుమతి ప్రదానోత్సవంలో భాగంగా చిత్ర కళా రంగంలో దిగ్గజాలను నిర్వాహకులు సత్కరించారు. కోనసీమ చిత్రకళా పరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి కొరసాల సీతారామస్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలోతెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ చిత్రకారుల చరిత్రతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. చోడవరానికి చెందిన చిత్ర దిగ్గజం బొడ్డేటి సూర్యనారాయణను డాక్టర్ వీరా ధన్వంతరి, శిల్పి పెద్దిరెడ్డి మాధవరావు, కె. కేశవవర్మ, అడబాల రామసత్యమూర్తి, ఆకుల రవితేజ సమక్షంలో నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రేమ సమాజం రాజు, డిఎస్ ప్రసాద్, కొండలరావు మాస్టర్, ప్రకాష్ మాస్టర్, కన్నయ్యశెట్టి హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన గౌరీ పరమేశ్వరుల సంబరం

ప్రజాశక్తి- అనకాపల్లి : పట్టణంలోని వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ఘనంగా ముగిసింది. ఉత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో ప్రజలు గౌరమ్మ జాతరను తిలకించారు. అమ్మ వారిని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దర్శించుకున్నారు. ఆయనను కమిటీ సభ్యులు సత్కరించారు. అలాగే సీతారామయ్యగారి బాణసంచా హంగామాను జనసేన నాయకులు భీమరశెట్టి రాంకీ ప్రారంభించారు. గౌరీ పరమేశ్వరుల సంబరం జయప్రదంపై అన్నిశాఖల అధికారులు, ప్రజలకు ఉత్సవ కమిటీ చైర్మన్ వాకాడ బాబు కృతజ్ఞతలు తెలిపారు. జాతరలో అవాంఛనీయఘటనలకు ఆస్కారం లేకుండా డిఎస్‌పి శ్రావణి, పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీకార్యదర్శి మద్దాల నూకరాజు, కోశాధికారి వేల్పుల గణేష్, సభ్యులు పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్ మనుగడ ప్రశ్నార్థకం!

- ఆరు దశాబ్దాల్లో ఎన్నడూ లేనివిధంగా బకాయిలు చెల్లించకుండానే క్రషింగ్‌కు సమాయత్తం
- పెదవి విరుస్తున్న కార్మికులు, సభ్యరైతులు
- కూటమి నేతల హామీల అమలుకు ఎదురుచూపులు

గోవాడ సుగర్స్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -చోడవరం : ఒకప్పుడు ప్రతిష్టాత్మకంగా నడిచిన గోవాడ సుగర్స్ మనుగడ ప్రశ్నార్ధకంగా మారింది. 1962లో ప్రారంభమైన చక్కెర కర్మాగారం, అంచెలంచెలుగా ఎదుగుతూ 2014 వరకు ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా సాగింది. ఏటా ఐదు లక్షల టన్నుల చెరకు క్రషింగ్ జరుపుతూ ఆదాయ వ్యయాల్లో సమతుల్యత పాటిస్తూ, రైతులు కార్మికుల ప్రయోజనా లకు పెద్దపీట వేస్తూ ముందుకు సాగింది. ఉమ్మడి రాష్ట్రంలో 18 సుగర్ ఫ్యాక్టరీలు సహకార రంగంలో ఉంటే, వాటిల్లో 17 మూతపడగా, ఒక గోవాడ ఫ్యాక్టరీ మాత్రమే నేటికీ కొనసాగుతోంది. 24 వేల మంది సభ్య రైతులు కృషితో ఇన్నాళ్లు నెట్టుకొట్టిన ఈ ఫ్యాక్టరీ సైతం ఇపుడు అంపశయ్యమీద ఉండే పరిస్థితి నెలకొంది.

గోవాడ సుగర్స్ సభ్య రైతుల్లో 80 శాతానికి పైగా చిన్న, సన్నకారు రైతులే కావడంతో, చెరుకుసాగు గిట్టుబాటు కాకపోయినా, పాడిపశుపోషణ అనుబంధంగా ఉండడంతో కష్టనష్టాలను భరిస్తూ ఇన్నాళ్లుగా నెట్టుకొస్తున్నారు. అయితే అది తలకు మించిన భారం కావడంతో చెరకు రైతులు చేతులెత్తేసే పరిస్థితి నెలకొంది. ఫలితంగా 24 వేల మంది సభ్యరైతుల్లో దాదాపు మూడింట రెండొంతలు మంది చెరకు సాగుకు దూరమయ్యారు మూడేళ్ల నుంచి ఫ్యాక్టరీ క్రషింగు మూడు లక్షల నుంచి, గత ఏడాది లక్ష 70 వేల టన్నులకు పడిపోవడ్డమే ఇందుకు నిదర్శనం. ఈ ఏడాది ఎనిమిది వేల మంది రైతుల నుంచి ఒకటిన్నర లక్షల టన్నుల చెరకు క్రషింగ్‌కు అగ్రిమెంట్ చేసుకున్నామని యాజమాన్యం చెబుతున్నా, అది కష్టమేనని రైతులు కార్మికులు అంటున్నారు.

ఫ్యాక్టరీ దుస్థితికి కారణం?

హుదూద్ తుఫాను తర్వాత అప్పట్లో ఫ్యాక్టరీలో చోటుచేసుకున్న అవకతవకలతో నష్టాలు ఒక భాగమైతే సహకార ఫ్యాక్టరీలకు ప్రభుత్వ ప్రోత్సాహకం, సాయం కరువు కావడంతో మరింత పీకల్లోతుకు కూరుకుపోయింది. వైసిపి ప్రభుత్వం రాకమునుపు ఫ్యాక్టరీ అప్పు రూ.150 కోట్లుగా ఉంటే, గత ఐదేళ్లలో అనేక రూపాల్లో ఫ్యాక్టరీకి రూ.89 కోట్ల నిధులు తీసుకొచ్చారు. ఆర్థిక కష్టనష్టాలతో కొట్టుమిట్టా డుతున్న ఫ్యాక్టరీని గాడిలో పెడతామని ఎంపీ సిఎం రమేష్, ఎమ్మెల్యేలు కెఎస్ఎంఎస్ రాజు, బండారు సత్యనారాయణలు, జనసేన నాయకులు పివిఎస్ఎన్ రాజు ఎన్నికల ముందు, తర్వాత వాగ్దానాలు చేస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడచినా హామీల అమలులో చర్యల్లేవు. డిసెంబర్ మొదటి వారంలో ఏటా ఆనవాయితీగా సుగర్స్ క్రషింగ్ ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ, నెలరోజులు దాటినా అటువంటి చర్యల్లేవు. ఇటీవల రూ.ఆరు కోట్ల వేతన బకాయిలు చెల్లించాలన్న డిమాండ్‌తో కార్మికులు విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టగా, సిఐటియు మద్దతు పలకడంతో ప్రజాప్రతినిధులు దిగిరాక తప్పలేదు. చోడవరం మాడుగుల ఎమ్మెల్యేలు కెఎస్ఎంఎస్ రాజు, బండారు సత్యనారాయణ ఫ్యాక్టరీలో కార్మికులతో సమావేశమై, సమాలోచనలు జరిపి, వారం రోజుల్లోనే జీతాలు చెల్లిస్తామనిహామీ ఇవ్వడంతో ఫ్యాక్టరీలోని రెండు కార్మిక యూనియన్లు ఆందోళనను విరమించాయి.

అయితే దీనిపై కార్మికుల్లోనే వ్యతిరేకత వ్యక్తమౌతోంది. ఆందోళనకుదిగిన తర్వాత కనీసం ఒక్కనెల వేతనమైనా చెల్లించకుండా సమ్మె విరమించడం ఏమిటనే అభిప్రాయం కార్మికులు వ్యక్తం చేస్తున్నారు. రైతులు, కార్మికులకు రూ.తొమ్మిది కోట్ల వరకు బకాయిలు ఉండగా, రిటైర్డు ఉద్యోగుల బకాయిలు చెల్లించాల్సి ఉంది.గత సీజన్ సంబంధించి 75 వేల టన్నులకు సంబంధించి ఒక్కో టన్నుకు రూ.200 వరకు గేటుఛార్జీలతో కలిపి బకాయి చెల్లించాల్సి ఉంది. అనిఏన బకాయిలు క్లియర్ చేసిన తర్వాతే ఫ్యాక్టరీ క్రషింగ్‌కు వెళ్లే ఆనవాయితీకి భిన్నంగా ఫ్యాక్టరీ చరిత్రలో మొదటిసారి బకాయిలు చెల్లించకుండానే క్రషింగ్‌కు సిద్ధపడుతున్నారని రైతులు అంటున్నారు.

తగ్గిన చెరుకు సాగు విస్తీర్ణం

గోవాడ సుగర్స్ పరిధిలో చోడవరం, మాడుగుల, నర్సీపట్నం, అనకాపల్లి నియోజకవర్గాలకు చెందిన 32 వేల ఎకరాల్లో చెరుకు సాగు అయ్యేది. ప్రస్తుతం అది ఆరు వేల ఎకరాలకు చేరుకుంది. పెట్టుబడి ఖర్చులు అధికమై గిట్టుబాటు కాకపోవడంతో చెరుకు సాగుకు స్వస్తి చెప్పిన రైతులు, యూకలిప్టస్, సరుగుడు, కొబ్బరి, పామాయిల్ వంటి తోటలు వేసి, ఫార్మా కంపెనీల్లో దినసరి కూలీలుగా మారిపోయారు.

కావాలనే క్రషింగ్ ఆలస్యమా?

ఏటా డిసెంబర్ మొదటివారంలో ప్రారంభమయ్యే చెరకు క్రషింగ్‌ను సుగర్ ఫ్యాక్టరీ ధీమాతోనే ఆలస్యం చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. గతంలో ఈ ప్రాంతం నుంచి శ్రీకాకుళం జిల్లాలోని సంకిలి ప్రైవేటు సుగర్ ఫ్యాక్టరీకి రైతులు చెరకును తరలించేవారు. అయితే ప్రస్తుతం రవాణా ఖర్చులు పెరగడంతో అంతదూరం తీసుకెళ్లడానికి రైతులు సుముఖంగా లేరు. దీంతో ప్రత్యామ్నాయం లేని పరిస్థితుల్లో గోవాడ సుగర్స్‌కు రైతులంతా చెరుకు సరఫరా చేయకతప్పని పరిస్థితి ఉందనే దీమాతోనే నెలరోజులు ఆలస్యం చేశారనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. కాగా కొనఊపిరితో కొట్టుమిట్లాడుతున్న గోవాడ సుగర్స్‌కు కూటమిప్రభుత్వం, నాయకులు ఇచ్చిన హామీ మేరకు గ్రాంట్‌లను కేటాయించి, పూర్వవైభవం తెచ్చేలా చర్యలు చేపట్టాలని సభ్యరైతులతోపాటు ఉద్యోగులు, కార్మికులు కోరుతున్నారు.

పలుచోట్ల ఘనంగా తీర్థాలు

యలమంచిలి తీర్థంలో మహిళల కోలాటం సందడి

ప్రజాశక్తి-యలమంచిలి : పట్టణంలోని ధర్మవరం వీధి కనకమహాలక్ష్మి వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరిగింది. కూటమి నాయకులు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, రోడ్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎంపి పప్పల చలపతిరావు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. పట్టణ, పరిసర గ్రామాల ప్రజలతో పాటు జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులతో కనకమహాలక్ష్మి ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఎంపిపి బోదెపు గోవిందరావు, పార్టీ నాయకులు అమ్మవారి సన్నిధిలో గడిపారు. తీర్థంలో మహిళలు వేసిన కోలాటం హైలెట్‌గా నిలిచింది. తప్పెట గుళ్ల కూడా ఆకట్టుకున్నాయి. కొఠారు సన్యాసినాయుడు సొంత నిధులతో కనీసం 15వేల మందికి భారి అన్నసంతర్పణ ఏర్పాట్లు చేశారు. సిఐ జనార్ధన్ ఆధ్వర్యంలో బందోబస్తు కల్పించారు. ఉత్సవ నిర్వహణ కమిటీ చైర్మన్ కొఠారు సాంబశివరావు తెలిపారు.

సబ్బవరం : మండలంలోని గోటివాడ గ్రామంలో సీతారాముల తీర్థ మహోత్సవం పిఎసిఎస్ మాజీ చైర్మన్ బొండా సత్యారావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, భక్తులు ఆదివారం సీతారాములకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ మాజీ చైర్మన్ బొండా సత్యారావు, ఎంపీటీసీ బొండా శేషు కుమారి, మాజీ సర్పంచ్ వడిసెల రమేష్ , సాగునీటి సంఘం అధ్యక్షుడు సాలాపు సూరిబాబు పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. సాయంత్రం స్వామిగరిడీలు, చిటికెల భజనలతో, తీన్మార్ డప్పులు, బాణసంచా పేలుళ్లతో తీర్థం ఘనంగా నిర్వహించారు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కె. కోటపాడు: కె.కోటపాడు గ్రామ దేవత మరిడిమాంబ తల్లి తీర్థం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామునుండే అమ్మవారికి గ్రామస్తులంతా పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బంధుమిత్రులతో ప్రతి ఇల్లు కళకళలాడింది. సాయంత్రం ఇత్తడి గుర్రాలు అంబారీ ఏనుగుతో గ్రామస్తులంతా కలిసి బాణసంచా డప్పు వాయిద్యాలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి రామాలయం వద్ద సంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

ప్రజాశక్తి -మునగపాక: మండలంలోని మూలపేట గ్రామంలో సీతారాములోరి తీర్థం సందర్భంగా పంచాయతీ పాలకవర్గం, రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు బహుమతులు అందజేశారు. రామాలయ కమిటీ అధ్యక్షులు ఆడారి కాశీరావు, కూటమి నాయకులు జెకె బ్రదర్స్, కాండ్రేగుల గాంధీ, గ్రామ పెద్దలు కాండ్రేగుల ఈశ్వరఅప్పారావు, భీశెట్టి మధుసూదన్ రావు, కాండ్రేగుల నాగేశ్వరరావు, బొడ్డేడ ఆదికుమార్ పాల్గొన్నారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి -సీలేరు: మారుమూల గిరిజన గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు కొనసాగు తున్నాయి. జీకే విధి మండలం దుప్పిలి వాడ పంచాయతీ పిల్లిగెడ్డ గ్రామస్తులు ఆదివారం సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటే విధంగా జరుపుకున్నారు. బంధుమిత్రులతో కలిసి గ్రామస్తులు థింసా నృత్యాలను వేస్తూ సందడి చేశారు.

అనాథను ఆదుకున్న 'మనం' ట్రస్టు

అనారోగ్యంతో అవస్థలు పడుతున్న అనాథ వెంకటేస్

ప్రజాశక్తి - యలమంచిలి : స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో ఒళ్లంతా పుండ్లతో, చలిలో అవస్థలు పడుతున్న ఒక అనాథకు మనం ఛారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. బాధితుడిని విశాఖ కెజిహెచ్‌కు మెరుగైన వైద్యం కోసం తరలించారు.
పదిరోజులుగా స్టేషన్‌రోడ్డులో ఇబ్బందులు పడుతున్న అనాథను విజ్జు డెంటల్ డాక్టర్ సింహాద్రి నాయుడు గమనించి 'మనం' ఛారిటబుల్ ట్రస్టు సమాచారమిచ్చి, ఆదుకోవాలని అభ్యర్ధించారు. వెంటనే స్పందించిన ట్రస్టు సభ్యులు ఆదివారం అనాథ పరిస్థితి చూసి చలించిపోయారు. పోలీసుల సహాయంతో ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ కోలుకున్న తర్వాత మమత చారిటబుల్ ట్రస్టులో ఆశ్రయం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మనం చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి పండూరి సురేష్ తెలిపారు. కాగా బాధితుని వివరాలపై ఆరాతీస్తే, మండపేటకు చెందిన వెంకటేష్‌గా గుర్తించారు. తనకు ఎవరూ లేరని, అనాథనని తెలిపారు.కార్యక్రమంలో ఎఎస్ఐ నాయుడుబాబు, దుర్గాప్రసాద్, రమణ, నరేంద్ర తదితరులున్నారు. కాగా అనాథను ఆదుకున్న మనం చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులను పలువురు అభినందించారు.

23 నుంచి గౌతమి గ్రంథాలయ స్వర్ణోత్సవం

ప్రజాశక్తి- మునగపాక: స్థానిక గౌతమి పఠన మందిరం(గ్రంథాలయం) స్వర్ణోత్సవ వేడుకలను ఈనెల 23 నుండి 26 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 23న ఉదయం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, సాయంత్రం స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్ పోటీలను అలాగే 24న సాయంత్రం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. 25న ఉదయం జాతీయ జెండా ఊరేగింపు, రాత్రి 7 గంటలకు అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారిచే "విడాకులు కావాలి" నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. 26న రిపబ్లిక్ డే సందర్భంగా ఉదయం జెండావిష్కరణ, రాత్రి 7 గంటలకు ఆదర్శ రైతు కుటుంబీకులకు సన్మానం, తర్వాత కళాంజలి హైదరాబాదు వారిచే "అన్నదాత" నాటిక ప్రదర్శన ఉంటుందని తెలియజేశారు. ఆయా కార్యక్రమాలకు క్రీడాకారులు, కళాకారులు అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

31 వరకు పశువైద్య శిబిరాలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని అన్ని గ్రామపంచాయతీల పరిధిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 31 వరకు పశు ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు స్థానిక పశు వైద్యాధికారిణి కెహెచ్‌పి మంజుషారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరాల్లో సంతాన లేమి సమస్య ఉన్న పశువులకు చికిత్స, పెద్ద పశువులు, దూడలకు నులిపురుగుల నివారణ టీకాలు వేస్తారన్నారు. పశు ఆరోగ్య వైద్య శిబిరాలను పాడిరైతులు, పెంపకందారులు వినియోగించుకోవాలని కోరారు.

జనసేనలోకి చౌడపల్లి సర్పంచ్ దంపతులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సమక్షంలో మండలానికి చెందిన చౌడేపల్లి గ్రామ సర్పంచ్ గండిబోయిన భాను, అతని భర్త వెంకట్ తన అనుచరులతో ఆదివారం జనసేన పార్టీలో చేరారు. సర్పంచ్‌తో ఉప సర్పంచ్ గురునాథ్, వార్డు సభ్యులు రాజు రమణ నాగేశ్వరరావు, వెంకట్, వెంకటేష్, నాగేశ్వరరావు, మరో 30మంది నాయకులు జనసేన పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి జనసేనలోకి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ స్వాగతం పలికారు.

సర్పంచ్ దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

కారిడార్ నిర్వాసితులతో ప్రభుత్వం చర్చలు జరపాలి

- 2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారం చెల్లించాలి - వైసిపి, సిపిఎం నేతలు, నిర్వాసితుల డిమాండ్

ప్రజాశక్తి -నక్కపల్లి: తమ సమస్యలపై ప్రభుత్వం చర్చలు జరపాలని కారిడార్ నిర్వాసితులు డిమాండ్ చేశారు. మండలంలోని చందనాడ పంచాయతీ తమ్మయ్యపేటలో ఆదివారం వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితుల సమావేశం జరిగింది. వైసిపి సీనియర్ నేత వీసం రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్, చందనాడ ఎంపిటిసి సభ్యులు గంటా తిరుపతి రావు, చందనాడ సర్పంచ్ భర్త తళ్ల భార్గవ్ తదితర నాయకులు హాజరయ్యారు. కారిడార్ నిర్వాసితుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిర్వాసితుల సమస్యలు పరిష్కారం చేయకుండా ప్రభుత్వం ఏకపక్షంగా నిబంధనలకు విరుద్ధంగా, చట్టాలను ఉల్లంఘించి పరిశ్రమల ఏర్పాటుకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిందని విమర్శించారు. పోలీసులను అడ్డం పెట్టుకొని రైతుల తోటలను నేలమట్టం చేస్తున్నారని, ఇది ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. నిర్వాసితుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం చేయకుండా పనులు చేపట్టడం అన్యాయమన్నారు. వెంటనే నిర్వాసితులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోవిందరావు, ధారబాబు, నరసింహమూర్తి, అప్పారావు, చిన్నాయుడు, పలువురు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

పలుచోట్ల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నర్సీపట్నం మండలం వేములపూడిలో పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మండలంలోని వేములపూడి - పద్మనాభుని బెన్నయ్య మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007- 2008 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ - విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. పూర్వ - విద్యార్థులు ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, ప్రతీ సంవత్సరం పూర్వ విద్యార్థులు కలుసుకొని తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు స్థలాన్ని అందించిన స్థల దాత పద్మనాభుని బెన్నయ్య శెట్టితో పాటు పూర్వపు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం వేములపూడి పాఠశాలకు ఇన్వర్టర్ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999 - 2000 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు కశింకోట చౌదరి తోట లో ఆత్మీయ సమావేశమయ్యారు.. ఆటపాటలతో రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహం గా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం :అచ్యుతాపురం, హరిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు కొండకర్ల ఆవలో ఆత్మీయంగా కలుసుకున్నారు. ప్రత్యేకంగా మహిళలు ఆనందానికి అంతులేని విధంగా అనుభూతి పొందారు. పలు ఆటలు ఆడారు. ఆవలో బోటు షికారు చేశారు.

కోటవురట్ల:మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 2010-2012 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ సైన్స్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాలలో స్థిరపడిన వారంతా వచ్చి గత స్మృతులను నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

కోటవురట్లలో పూర్వ విద్యార్థులు

గొలుగొండ మండలం ఎఎల్ పురంలో పూర్వ విద్యార్థులు

గొలుగొండ: మండలంలోని ఏ.ఎల్.పురం హైస్కూల్లో 1973-1976 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కృష్ణదేవిపేట అల్లూరి పార్కులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎక్కడెక్కడో వివిధ ఉద్యోగాల్లో, వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా ఇక్కడకు వచ్చి అలనాటి విషయాలను గుర్తుకు తెచ్చుకొని ఆనందంగా గడిపారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థుల సంఘం కమిటీని ఎన్నుకున్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులుగా పోతల శ్రీరామ్మూర్తి, కార్యదర్శిగా చైతన్యబాబు, సభ్యులుగా ఎల్వి.రమణ, వబ్బలరెడ్డి శ్రీనివాసరావు, వీరభద్రుడు, ఎం. రాంబాబులను ఎన్నుకున్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని బస్కి పంచాయతీ కొంత్రాయిగుడ గ్రామంలో తాగు నీరు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మహిళలు, సిపిఎం నేతలు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నేత సమర్డి బాబురావు, పెసా కార్యదర్శి కొర్రా దేవన్న మాట్లాడుతూ, కొత్రాయిగుడ గ్రామంలో రోజురోజుకి తాగు నీరు సమస్య తీవ్రంగా పెరుగుతుందని, దీంతో గుక్కెడు నీళ్లు దొరకడం కష్టంగా మారిందన్నారు. గతంలో అనేక సార్లు పోరాటాలు, ఆందోళనలు చేసిన ఫలితంగా బోరు మంజూరు అయ్యిందన్నారు. బోరు నుంచి కళాయి కనెక్షన్ ఇవ్వకుండా మధ్యలోనే వదిలేశారని అన్నారు. బోరు తవ్వి ఏడాది గడుస్తున్నా నేటికి మంచినీరు సమస్య పరిష్కారం చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కొర్రా సుబ్బారావు, సమర్డి దాసు, సమర్డి చంప, సమర్డి కలిమ, పూర్ణిమ, నాగమణి, కిల్లో జయంతి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అరకు ఉత్సవ్‌కు పటిష్ట ఏర్పాట్లు

అల్లూరి కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: సందర్శకులను, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా చలిలి పేరుతో అరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. ఆదివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ మాట్లాడుతూ, ముందుగా వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం కల్పించాలన్నారు. స్థానికంగా తాజంగి, లంబసింగి, వనజంగి, కొత్తపల్లి జలపాతాలు, చాపరాయి వంటి ప్రదేశాలతో కూడిన వీడియోలను అరకు ఉత్సవ్ ప్రమోషన్ క్యాంపైన్లో చూపించాలన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కళారూపాలను రోజువారి కార్యక్రమాలను రూపొందించాలన్నారు. వారికి అవసరమైన వసతి, భోజన, రవాణా ఏర్పాట్లను చూడాలని తెలిపారు. అందుకు తగిన విధంగా కమిటీలను ఏర్పాటు చేసే బాధ్యతలను అప్పగించాలని సూచించారు. విశాఖపట్నం నుండి అరకు వచ్చి, వెళ్లే వారికి ట్రావెల్ ఆపరేటర్లతో మాట్లాడి సీట్లను బట్టి ఒక ధరను నిశ్చయించాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆనరోరియం, వేదిక, బారికేడ్లు, రవాణా, వసతి, భోజనం వంటి సౌకర్యాల కల్పనకు బడ్జెట్ అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. ఆహ్వాన పత్రికలు ప్రోటోకాల్ ప్రకారం సిద్ధం చేయాలన్నారు. అరకు ఉత్సవంలో స్ట్రీట్ లైట్లు, వెల్కమ్ ఆర్చులు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు తదితర అంశాలకు జీవీఎంసీ సహకారం తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ్, పాడేరు ఐ టి డి ఎ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, సిపిఓ ఎస్ఎస్ ఆర్ కె పట్నాయక్, క్యూరేటర్స్ శంకర్రావు, మురళి, అరకు తహసిల్దార్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న టిడిపి నాయకులు

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని జీ.కొత్తూరు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను టీడీపీ నాయకులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ రవివర్మ మాట్లాడుతూ, రూ.13లక్షల నిధులతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ పట్టిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవిందు, చంటి పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఉన్న నీటి శుద్ధి యంత్రం

వృథాగా నీటి శుద్ధి యంత్రం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వ హయాంలో నాడు నేడు నిధులతో ఏర్పాటు నీటి శుద్ధి యంత్రం నిరుపయోగంగా మారింది. గడిచిన ఏడాది కాలంగా వృథాగా పడి ఉంది. లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ఈ నీటి శుద్ధి యంత్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతుంటున్నారు.

నేడు గ్రామ సభ

ప్రజాశక్తి - చీడికాడ:మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై గ్రామ సభ నిర్వహించబడుతుందని ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఏపీవో గంగనాయుడు తెలిపారు. ఈ సభ ముఖ్యంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల జరిగిన పనితీరు, పరిశీలనపై సామాజిక తనిఖీ జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. జడ్పిటిసి, ఎంపీపీ, అన్ని శాఖల ఏఈలు, సర్పంచులు, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.


భోజనం అందజేస్తున్న రాజేష్

వృద్ధులకు భోజనం ప్యాకెట్లు అందజేత

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏఎల్.పురం గ్రామంలో తారక్ యువసేన ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు మధ్యాహ్న భోజనాలను స్పీకర్ అయ్యన్న తనయుడు చింతకాయల రాజేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా యువసేన సభ్యులు మాట్లాడుతూ తారక్ యువసేన ట్రస్ట్ ఆదివారం ప్రారంభించామన్నారు. ఈ ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు, ఒంటరి వృద్ధులకు చేయూతనివ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, నర్సీపట్నం కౌన్సిలర్లు ధనిమిరెడ్డి మధు, ట్రస్ట్ సభ్యులు అప్పలరాజు, శేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న సర్పంచ్

గ్రామ సేవకులకు సన్మానం

ప్రజాశక్తి- రావికమతం:నిత్యం గ్రామ సేవలో నిమగ్నమై పనిచేస్తున్న గ్రామ సేవకులను సన్మానించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని సర్పంచ్ దాసరి సూర్య కుమారి తెలిపారు. మండలంలో కవగుంట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం పారిశుద్ధ్య కార్మికులను, ఎలక్ట్రీషియన్లను, బార్బర్లను సర్పంచు సాలువాతో సన్మానించి నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, వీరంతా గ్రామానికి ఎంతగానో సేవలు అందిస్తున్నారని కొనియాడారు. గ్రామ అభివృద్ధికి ప్రజలు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ ప్రగడ నాగేశ్వరరావు, వైయస్సార్సీపి గ్రామ నాయకులు వెచ్చం చిన్న నాగరాజు, పచ్చికూర వరహాలు, మాజీ వార్డు మెంబర్ అప్పారావు, పచ్చికూర రాము, కొంగా రాజారావు, రేణం రమణ ,మాజీ స్కూల్ కమిటీ ఛైర్మన్ ప్రగడ నాయుడు బాబు, మాజీ వార్డ్ మెంబర్ రేణం చిన వెంకయ్య నాయుడు, సమాల రాజు, వరహాలు, దాసరి శ్రీను పాల్గొన్నారు.

రోడ్డుపై కురుస్తున్న పొగమంచు

మన్యంలో పెరిగిన చలి తీవ్రత

- చింతపల్లిలో 7.3 డిగ్రీలు

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రాంతంలో ఆదివారం సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. చింతపల్లిలో 7.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యిందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడిఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. 11 గంటలైనా వీడని పొగ మంచు కారణంగా వాహనదారులు ప్రయాణం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసిన పరిస్థితి నెలకొంది. చలి తీవ్రత కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు లేకపోలేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

శ్రమదానంతో కల్వర్టు పనులు

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని పట్టాం పంచాయతీ డాబవలస సమీపంలో ఉన్న బైరోడివలస, పట్టాం గ్రామస్తులు కలిసి శ్రమదానంతో కల్వర్టు రహదారి మరమ్మతులు ఆదివారం చేపట్టారు. కల్వర్టు మరమ్మతులకు గురై నిర్మాణానికి నోచుకోక పోవడంతో ప్రమాదాలకు నిలయం మారింది. వర్షాకాలం వస్తే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే రహదారిపై కించుమండ వారపు సంతకు వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో మూడు మండలాల ప్రజలు ఇదే రహదారి మీదుగా వారపు సంతలకు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేక పోవడంతో గ్రామస్తులందరు కలిసి స్వచ్ఛందంగా కల్వర్టు రహదారి గుంతలను పూడ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బూత్ ఇన్చార్జి కొర్రా నూకరాజు, బాలన్న, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా గోబ్యాక్

-విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో వామపక్షాల నిరసనల వెల్లువ

ఎస్.రాయవరంలో నిరసన చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అవమాన కరమైన, అప్రతిష్టాకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటన నుంచి వెనక్కుపోవాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. అమిత్‌షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాపితంగా నిరసనలకు వామపక్ష పార్టీలు పిలుపునిచ్చిన నేపథ్యంలో విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆదివారం సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ), సిపిఐఎంఎల్ ప్రజాపోరు పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు జివిఎన్.అచ్యుతరావు, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, ప్రజాపోరు జిల్లా కార్యదర్శి దేవా మాట్లాడుతూ రాజ్యాంగ 75వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభలో ప్రతిపక్ష పార్టీలు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి సవరణలకు పూనుకోవడం, రాజ్యాంగ హక్కులను హరించడం సరైంది కాదని పెద్దఎత్తున నినదించడంతో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను అభిమానించే వారిని ఎగతాళి చేస్తూ.. అంబేద్కర్ జపం చేయడం ఫ్యాషన్‌గా మారిందని, ఆ జపం ఏదో దేవుడిని తలుచుకుంటే స్వర్గమన్నా వచ్చేదని పేర్కొంటూ అత్యంత అభ్యంతరకరమైన, అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. దేశ ప్రధాని కూడా అమిత్‌షాను వెనుకేసురావడం దేశానికే అవమానకరమన్నారు. దేశ వ్యాపితంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా కేంద్ర బిజెపి వైఖరిలో మార్పులేదని దుయ్యబట్టారు. రాజ్యాంగంపై ప్రమాణంచేసి పదవి చేపట్టిన మతోన్మాదులకు అంబేద్కర్ అంటే ఎందుకంత భయమని ప్రశ్నించారు. ఆంధ్ర రాష్ట్రంలో అన్ని తరగతుల, వర్గాల ప్రజానీకం, సామాజిక, ప్రజా సంఘాలు బిజెపి కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టినా చంద్రబాబు, పవన్ కల్యాణ్, కూటమి పెద్దలు ఏ మాత్రమూ నోరుమెదపకపోగా విజయవాడకు వచ్చిన అమిత్‌షాకు స్వాగతం పలకడం సరైనది కాదన్నారు. టిడిపి, జనసేన, బిజెపిల నాయకులకు దళితులపట్ల, రాజ్యాంగ విలువలు, నైతిక విలువల పట్ల చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. తక్షణమే అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలుచేసిన అమిత్‌షాను ఎపి నుంచి వెనక్కు పంపాలని, రాష్ట్రంలో పర్యటనలకు అనుమతించరాదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ, జిల్లా కమిటీ సభ్యులు బొట్టా ఈశ్వరమ్మ, డి.అప్పలరాజు, వివిఎస్.కుమార్, ఎం.సుబ్బారావు, వై.రాజు, ఆర్ఎన్.మాధవి, కె.కుమారి, సిపిఐ నాయకులు పి.చంద్రశేఖర్, ఎస్‌కె.రెహ్మాన్, ఎండి.బేగం తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షాకు రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న అన్నారు. అమిత్‌షా పర్యటనకు నిరసనగా ఆదివారం. అనకాపల్లి నెహ్రూ చౌక్, అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు అధ్యక్షతన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ దేశ ప్రజలకు ఆమిత్‌షా క్షమాపణలు చెప్పాలని, ఆయనను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.. దేశ సమైక్యతకు,సమగ్రతకు నష్టం కలిగించే విధంగా బిజెపి ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవీ బాధ్యతలు చేపట్టిన అమిత్‌షా రాజ్యాంగ దినోత్సవం రోజునే అంబేద్కర్ పేరు ఉచ్చరించ వద్దనడం సిగ్గు చేటన్నారు. అంబేద్కర్ ఆశయాలను హత్య చేస్తున్నారన్నారు. అంబేద్కర్‌ను కించపరచడంతో బిజెపి నిజస్వరూపం, ఆర్ఎస్ఎస్ ఉద్దేశం బహిర్గతమైందన్నారు. 400 ఎంపీ సీట్లు వస్తే రాజ్యాంగాన్నే మార్చేస్తామని బిజెపి ప్రకటించడంతో దీన్ని దృష్టిలో పెట్టుకుని 240 సీట్లకే పరిమితం చేశారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కూల్చడమే లక్ష్యంగా పనిచేస్తున్న బిజెపి విధానాలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి. ఉమా మహేశ్వరరావు, డి. డి వరలక్ష్మి, సిపిఎం నాయకులు జి. నాయనబాబు, కె. ఈశ్వరరావు, కె. తెల్లయ్యబాబు, డి. శ్రీనివాసరావు, ఎస్. వి.నాయుడు, ఎం.రమణ పాల్గొన్నారు.

సబ్బవరం : అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వెంటనే దేశప్రజలకు క్షమాపణ చెప్పి, తన పదవికి రాజీనామా చేయాలని, సిపిఎంజిల్లా కార్యవర్గ సభ్యులు బి.ప్రభావతి డిమాండ్ చేశారు. ఆదివారం మేజర్ పంచాయతీ సబ్బవరం సాయినగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద అమిత్‌షా వ్యాఖ్యలు, రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ సిపిఎం మండలకార్యదర్శి ఉప్పాడ సత్యవతి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కేంద్ర మంత్రివర్గం నుంచి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం. గౌరేశ్వరరావు , కె. కోటి, వై. సోంబాబు, రామనాయుడు, పి.కోటి ,అంబేద్కర్ సేవా సంఘం యూత్ పాల్గొన్నారు.

సబ్బవరంలో...

చోడవరం :.అంబేద్కర్‌ను అవమానపరిచిన అమిత్‌షా గో బ్యాక్‌అంటూ ఆదివారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో నిరసనలో కర్రి రమణ .ఆతవ సురేష్ మేరపు రెడ్డి శీను. ఖండేలా వెంకట్రావు. అప్పన్న. ఈశ్వరరావు. అప్పారావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్‌ను రాజ్యసభ లో అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం.అప్పలరాజు,జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం మండలంలోని పెద్ద గుమ్ములూరు అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ, కేంద్ర మంత్రివర్గం నుంచి అమిత్ షా ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసారు. దేశ ప్రజలకు ఆమిత్ షా క్షమాపణలు చెప్పాలన్నారు. దేశ సమైక్యతకు, సమగ్రతకు నష్టం కలిగించే విధంగా బిజెపి ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. అణగారిన కులాలను అణగదొక్కడం సరికాదన్నారు. దేశ వ్యాప్తంగా నిరసనలు కొనసాగుతుంటే రాష్ట్రంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, ప్రతి పక్షనేత జగన్ ఈ అంశం పై నోరు తెరవక పోవడం శోచనీయమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కూల్చడమే లక్ష్యంగా బిజెపి పని చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, ప్రసాద్ పాల్గొన్నారు.

అనకాపల్లిలో నిరసన చేపడుతున్న సిపిఎం నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి

-టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్

ప్రజాశక్తి నాతవరం:మండలంలోని ఏపీ పురం పంచాయతీ ఉప్పరిగుడం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వైసీపీ నుండి నక్క రాంబాబు కుటుంబం తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి విజయ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న విజయ్ వీటిని స్పీకర్ అయ్యన్న పాత్రుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రతి సంవత్సరం ఆత్మీయ సమావేశంలో పాల్గొనడం ఆనందంగా ఉంటుందని చెప్పారు. కార్యకర్తలకు ఎప్పుడూ తమ కుటుంబం అండగా ఉంటుందని తెలిపారు. అనారోగ్యంతో మృతి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త నక్క అచ్చియ్య కుటుంబానికి విజయ్ రూ.1,50,000 అందించారు. ఈ కార్యక్రమంలో తాండవ ఛైర్మన్ కారక సత్యనారాయణ, తాండవ వైస్ ఛైర్మన్ మేడవ రెడ్డి జోగిబాబు, నగర సాధికార సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం నూకరాజు, అనకాపల్లి జిల్లా సెక్రటరీ నక్క రమణ, సర్పంచ్ పైల రమేష్ నాయుడు, మాజీ సర్పంచ్ పారుపల్లి రామచంద్ర, ఎంపీటీసీ లోక లావరాజు, ఎర్ర కాశి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విజయ్